9th
- HAPPY -
ANNIVERSARY

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 సంచిక : 325 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 6 ఆగస్టు 2024 వెల : 5/-రూ॥
VOLUME :10 ISSUE : 325 PAGES : 12 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM TUE 6 AUGUST 2024 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

టాప్-10లో ఒక్క ఏపీ యూనివర్సిటీ లేకపోవడం బాధాకరం

కలెక్టర్ల సమావేశం పెట్టి మరీ ప్రజావేదికను కూల్చేశారు..

అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశం

- నైపుణ్యాభివృద్ధి, విద్య తదితర అంశాలపై చర్చ
- గతంలో నాక్ అక్రెడిటేషన్ టాప్-10లో ఏపీ వర్సిటీలు ఉండేవన్న చంద్రబాబు
- ప్రస్తుతం రాష్ట్రంలో వర్సిటీల పరిస్థితి పట్ల విచారం
- ప్రజావేదిక కూల్చివేతతో వైసీపీ విధ్వంసం మొదలైందన్న సీఎం
- గత ఐదేళ్లలో అన్ని రంగాలను వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపణ
- ఈ సమావేశం చరిత్రను తిరగ రాయబోతోందన్న చంద్రబాబు
- తన పనితీరుపైనా రివ్యూ ఉంటుందని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ప్రపంచస్థాయి ఉద్యోగాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యార్థుల నైపుణ్యాలు పెంచే చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా ఏపీలోని యూనివర్సిటీల పరిస్థితి పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. గతంలో నాక్ అక్రెడిటేషన్ లో ఏపీ విశ్వవిద్యాలయాలు టాప్-10లో ఉండేవని, కానీ ఇప్పుడు ఏపీకి చెందిన ఒక్క వర్సిటీ కూడా టాప్-10లో లేకపోవడం బాధాకరమని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాలు కూడా ఎప్పటికప్పుడు మారుతూ ఉండాలని చంద్రబాబు అభిలషించారు. అంతర్జాతీయస్థాయిలో నైపుణ్యాలు సాధించేలా శిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. వర్చువల్ వర్కింగ్ కోసం ఓ విధానం రూపొందించాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వర్చువల్ వర్కింగ్ హబ్ గా అవతరించాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు తెలిపారు. 'ప్రజావేదిక' కూల్చివేతతో గత ప్రభుత్వ విధ్వంసం మొదలైందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆయనీ వ్యాఖ్యలు చేశారు. కలెక్టర్లతో సమావేశం పెట్టి మరీ వేదికను కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ అకృత్యాలను భరించలేకే ఎన్నికల్లో ప్రజలు వారికి గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు రాష్ట్రంలోని అన్ని రంగాలను దోచుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో చూసిన విధ్వంసం, బెదిరింపులు తమ ప్రభుత్వంలో ఉండవని స్పష్టం చేశారు. చిన్నచిన్న తప్పులంటే సరిచేయవచ్చని, కానీ విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించాలంటే మాత్రం చాలా కష్టపడాల్సి ఉంటుందని అన్నారు. ప్రపంచంలో అత్యధిక ఆదాయం సంపాదించేది భారతీయులేనని, అందులోనూ 33 శాతం తెలుగువారే ఉన్నారని పేర్కొన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా ప్రజలు తమను గెలిపించారని, వారికి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రాన్ని బాగు చేస్తామని చెప్పారు.

ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇకపై ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళ ందని, నేటి కలెక్టర్ల సమావేశం చరిత్రను తిరగరాయబోతోందని పేర్కొన్నారు. తాను కూడా ఇకపై సమయపాలన పాటిస్తానని, తన పనితీరుపైనా రివ్యూ ఉంటుందని చంద్రబాబు తెలిపారు.

హైకోర్టులో అరవింద్ కేజ్రీవాల్‌కు చుక్కెదురు

- సీబీఐ అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేసిన కేజ్రీవాల్
- కారణాలు లేకుండా అరెస్ట్ చేసిందని చెప్పడానికి ఆధారాలు లేవన్న హైకోర్టు
- కేజ్రీవాల్ పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదు రైంది. ఈ కేసులో సీబీఐ తనను అరెస్ట్ చేయడాన్ని ఆయన సవాల్ చేశారు. అయితే

వివరాలు 2లో..

హీరా గోల్డ్ కుంభకోణం కేసు..

ముగిసిన ఈడీ దర్యాప్తు

IN THE INTEREST OF ALL MANKIND
HEERA GROUP
"The name you can Trust"

పెన్ పవర్ డెస్క్:కొన్ని రోజులుగా హీరా గోల్డ్ కుంభకోణంపై ఈడీ చేస్తోన్న దర్యాప్తు ఇవాళ్టితో ముగిసింది. తాజాగా ఈ దర్యాప్తులో భా గంగా

వివరాలు 2లో..

చంద్రబాబు అనుభవజ్ఞుడు.. ఆయన నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది

కలెక్టర్ల సమావేశంలో పవన్

- రాజ్యాంగం ఎంత గొప్పదైనా పనిచేసే వారు సరిగా లేకపోతే నష్టమన్న పవన్ కల్యాణ్
- విభజన వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామని గుర్తు చేసిన డిప్యూటీ సీఎం
- 97 స్ట్రైక్ రేట్‌తో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్న జనసేన బాస్

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు గురువని, ఆయన నుంచి తనలాంటి వారు నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం ఎంత గొప్పదైనా దానిని అమలు పరిచేవారు సరిగా లేకపోతే ఆ వ్యవస్థ పనిచేయదని పవన్ పేర్కొన్నారు. బలహీనమైన రాజ్యాంగం ఉన్నా ప్రజల కోసం పనిచేసే వారు ఉంటే ఆ వ్యవస్థ బాగా పనిచేస్తుందని

దేశం నుంచి పారిపోయిన షేక్ హసీనా...

సైన్యం చేతికి బంగ్లాదేశ్ పాలన

- అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సైనిక పాలన విధించాం: బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్
- బంగ్లాదేశ్ లో హింసాత్మకంగా రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనలు
- ఇప్పటివరకు 300 మంది వరకు మృతి
- ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా
- ఆమె బంగ్లాదేశ్ ను వీడి భారత్‌కు చేరుకున్న షేక్ హసీనా...
- బంగ్లాదేశ్ పాలనను తన చేతుల్లోకి తీసుకున్న సైన్యం

వివరాలు 2లో..

ఖాకీ పౌరుషం తెలుసు అని మాట్లాడిన పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు మాట్లాడడంలేదు

- ఏపీలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్న పేర్ని నాని
- నడిరోడ్డుపై చంపేస్తుంటే గాల్లోకి కూడా కాల్పులు జరపలేదని విమర్శలు
- పోలీసులు కూడా కూటమి నేతల చేతిలో అవమానపడుతున్నారని వెల్లడి

వివరాలు 2లో..

అమరావతి ఆర్-5 జోన్ లబ్ధిదారులపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- అమరావతిలో ఆర్-5 జోన్ తీసుకువచ్చిన గత ప్రభుత్వం
- ఇతర ప్రాంతాల పేదలకు అమరావతిలో స్థలాల కేటాయింపు
- జిల్లా కలెక్టర్లతో చంద్రబాబు సమావేశం
- ఆర్-5 జోన్ లబ్ధిదారులకు వారి సొంత ప్రాంతాల్లో స్థలాలు కేటాయించాలని ఆదేశం
- లబ్ధిదారులకు అమరావతిలో స్థలాలు కేటాయించలేమని స్పష్టీకరణ

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని ఆర్-5 జోన్ వివాదానికి తెరదించే ప్రయత్నం చేశారు. ఇవాళ అమరావతిలో సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాజధానిలోని ఆర్-5 జోన్ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. ఆర్-5 జోన్ లబ్ధిదారులకు వాళ్ల ప్రాంతాల్లోనే ఇళ్లు కేటాయించాలని సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..

ఆల్ ది బెస్ట్ బసవయ్య..

ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆసక్తికర ట్వీట్

- ఆర్థిక ఇబ్బందులతో ఐఐటీలో చేరలేకపోతున్నానంటూ బసవయ్య అనే విద్యార్థి ట్వీట్
- రూ.4 లక్షల ఫీజు చెల్లించలేనని ఆవేదన
- ఫీజు విషయం నేను చూసుకుంటా... నువ్వు చదువుకో అంటూ లోకేశ్ భరోసా
- లోకేశ్ ను ప్రశంసించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

వివరాలు 2లో..

వరద బీభత్సం.. నాగార్జున సాగర్ 16 గేట్లు ఎత్తివేత

పెన్ పవర్ డెస్క్:పక్క రాష్ట్రాలలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ పూర్తిగా నిండడానికి వస్తుంది. ఉదయం 10:57 గంటలకు నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సీఈ నాగేశ్వరరావు ఈఈ మల్లికార్జున రావు ప్రత్యేక పూజలు

వివరాలు 2లో..

నాకు సెక్యూరిటి తగ్గించారు..

ఏపీ హైకోర్టులో జగన్ పిటిషన్

- తనకు సీఎం హోదాలో ఇచ్చే భద్రత కావాలన్న జగన్
- జూన్ 3 నాటికి జగన్ కు 900 మందితో భద్రత ఉండేదన్న న్యాయవాదులు
- ఇప్పుడు కూడా అదే రీతిలో సెక్యూరిటీ కల్పించాలంటూ జగన్ పిటిషన్

వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:తనకు వ్యక్తిగత భద్రత తగ్గించారంటూ వైసీపీ అధినేత జగన్ ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి సెక్యూరిటీని కొనసాగించేలా

సెప్టెంబర్ లో ఓటర్ల జాబితా సవరణ ప్రారంభం

వచ్చే ఏడాది 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

సెప్టెంబర్ 30 నుంచి ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ

పెన్ పవర్ డెస్క్: వచ్చే ఏడాది రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. రెండు టీచర్, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. జీవన్?రెడ్డి, రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి పదవీకాలం 2025 మార్చి 29న ముగియనుంది. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం సెప్టెంబర్ 30 నుంచి ఓటరు జాబితాల సవరణ ప్రక్రియ చేపట్టనుంది.

వివరాలు 2లో..

निर्वाचन सदन
NIRVACHAN SADAN
भारत निर्वाचन आयोग
ELECTION COMMISSION OF INDIA

సంపాదకీయం

కేసిఆర్, జగన్ పయనం ఎటు?

రాజకీయ స్నేహితులు కేసిఆర్, జగన్ పయనం ఎటు? ఎన్డీఏ కూటమిలో చేరుతారా? ఇండియా కూటమిని ఆశ్రయిస్తారా?ఇద్దరూ కలిసి నిర్ణయం తీసుకుంటారా?లేకుంటే వేర్వేరు మార్గాల్లో వెళ్తారా?తెలుగు రాష్ట్రాల్లో ఇదే చర్చ నడుస్తోంది.దాదాపు ఇద్దరి పరిస్థితి అలానే ఉంది.2018 ఎన్నికల్లో ఓడిపోయారు కేసీఆర్. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా రాలేదు. దీంతో తెలంగాణలో కెసిఆర్ పార్టీ మనుగడ కూడా కష్టమవుతోంది. ఆ పార్టీ నుంచి ఇతర పార్టీలోకి చేరికలు పెరిగాయి. ఏకంగా ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లోకి క్యూపడుతున్నారు. మరోవైపు కుమార్తె కవిత అవినీతి కేసుల్లో చిక్కుకొని జైలు జీవితం అనుభవిస్తున్నారు. ఏపీలో కూడా జగన్ పరిస్థితి అలానే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైంది. 11 అసెంబ్లీ సీట్లకే పరిమితమైంది. కనీసం జగన్ కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు అక్రమాస్తుల కేసులు, బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య అంశం తెరపైకి వస్తోంది.రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులపై దాడులు,కేసులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో పార్టీని కాపాడుకోవడం ఇబ్బందికరమే. అధికారంలో ఉన్న సమయంలో రాజకీయ శత్రువులను పెంచుకున్నారు ఈ ఇద్దరు నేతలు. సొంత రాష్ట్రాలతో పాటు జాతీయస్థాయిలో నమ్మదగిన స్నేహాన్ని కొనసాగించలేకపోయారు. దాని ప్రభావం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. తాము ఇబ్బందుల్లో ఉన్న పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం మద్దతు తెలిపేందుకు కూడా ముందుకు రాని పరిస్థితి. అందుకే వీరిద్దరూ పునరాలోచనలో పడ్డారు. జాతీయస్థాయిలో స్నేహం పెంచుకోవాలని చూస్తున్నారుఈ ఇద్దరు నేతలకు ఇప్పుడు జమిలి ఎన్నికల భయం పట్టుకుంది. 2019 నుంచి కార్యాచరణ ప్రారంభించింది బిజెపి. కానీ 2024 ఎన్నికలకు ఒక ఏడాది ముందు జమిలి ఎన్నికలకు సంబంధించి కార్యాచరణ ప్రారంభమైంది. సాధ్యాసాధ్యాలపై ఒక కమిటీని వేసింది కేంద్రం. ఈ కమిటీకి అధ్యక్షుడిగా మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ని నియమించింది. ఆయన నాయకత్వంలో కమిటీ ఇప్పటికే చాలాసార్లు భేటీ అయింది. 2029 నాటికి దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయని చెబుతున్నారు. అదే జరిగితే దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. జాతీయ పార్టీల ప్రభావం ప్రాంతీయ పార్టీలపై తప్పకుండా పడుతుంది.ప్రాంతీయ పార్టీల మధ్య పోటీ కంటే.. కూటమిల మధ్య గట్టి ఫైట్ నెలకొనే అవకాశం ఉంది. తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్ ఏదో ఒక కూటమిలో చేరక తప్పని పరిస్థితి. ఇప్పటికే ఏపీలో ఎన్డీఏ కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన ఉన్నాయి. ఇండియా కూటమిలో కాంగ్రెస్, వామపక్షాలు కొనసాగుతున్నాయి. ఏ కూటమిలో చేరకుండా వైసిపి ఉంది. రెండు రాష్ట్రాల్లో కూడా బలమైన ప్రతిపక్ష పార్టీ నేతలు రాకుండా దుమ్మా కొడుతున్నారు. కేసీఆర్ దాదాపు 40 అసెంబ్లీ సీట్లు గెలుచుకొని బలమైన ప్రతిపక్ష నేతగా కనిపిస్తున్నారు కానీ ఆయన అసెంబ్లీలోకి వెళ్లిన సందర్భమే లేదు మరోవైపు జగన్ ప్రతిపక్ష హోదా లేదు అయినా ఆయన వెళ్లొచ్చు. కానీ ఆయన కూడా అసెంబ్లీని పూర్తిగా బహిష్కరించారు. బయట మాట్లాడుతున్నారు తప్ప అసెంబ్లీలోకి వెళ్లి ఎన్నికల ప్రచార సమయంలో మాట్లాడినట్లు మాట్లాడలేకపోతున్నారు.ఏపీలో బడ్జెట్ సమావేశాలు మొదలైన రోజు జగన్ ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారు. మరోవైపు కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోయారు. తర్వాత మీడియా సమావేశంలో కొద్దిసేపు మాట్లాడారు అనంతరం ఆయన కనిపించిన దాఖలాలు లేవు. సాధారణంగా ప్రతిపక్ష హోదా అంటే ఒక క్యాబినెట్ మినిస్టర్ తో సమానమైనది. దానిని సద్వినియోగం చేసుకుంటూ ప్రజల కోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. కానీ ఓడిపోతే ఇక తమకు రాష్ట్రంతో సంబంధం లేనట్లు, అధికారంలో ఉన్న వాళ్ళు ఏం చేసినా తమకు అనవసరం క్వశ్చన్ చేయమన్నట్లు కెసిఆర్ ప్రవర్తిస్తున్నారు. మరోవైపు జగన్ కూడా అలాగే తయారయ్యారు.కెసిఆర్ జగన్ పార్టీల నుంచి వెళ్ళిపోతున్నావా ఎమ్మెల్యేల సంఖ్య కూడా పెరుగుతోంది. కేసీఆర్ వారిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు జగన్ మాత్రం ఆ ప్రయత్నాలు చేయనట్లే కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు తమ ఎమ్మెల్యేలతో జగన్ గాని కెసిఆర్ గానీ మాట్లాడలేదు ఇప్పుడు ఉండమంటే వాళ్ళు ఉంటారా అనేది కూడా ప్రశ్నార్థకమే. ఏపీలో వైసీపీ పట్ల సానుభూతి ఇప్పట్లో కనిపించేలాగా కనిపించడం లేదు. కెసిఆర్ పరిస్థితి కూడా అలానే తయారయింది. లోక్‌సభ ఎన్నికల్లో అతను ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయారు.రైతుబంధు, దళిత బంధు, బీసీ బంధు అంటూ కేవలం కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే డబ్బులు ఇస్తానని కేసీఆర్ అంటున్నారు కానీ పేద ప్రజలకు మాత్రం ఇల్లు కట్టిస్తానని చెప్పడం లేదు. కొన్ని హామీలను నెరవేర్చిన కీలకమైన హామీలను నెరవేర్చడంలో ఫెయిల్ అయ్యారు. అందుకే ప్రజల్లో ఆగ్రహం ఎక్కువగా ఉంది. మరి వచ్చేసారి కాంగ్రెస్ కంటే కేసీఆర్ ఏ బెటర్ అని ఒక నిర్ణయానికి వస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇండియా కూటమికి చెందినది. బిజెపి ఎన్డీఏ కు నేతృత్వం వహిస్తోంది. దీంతో అక్కడ ఏ కూటమికి చెందినది కేసీఆర్ పార్టీ2029లో జమిలి ఎన్నికలు జరిగితే.. జగన్ ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించాలి.ఎన్డీఏలో టిడిపి, జనసేనలు బలమైన పక్షాలు కావడంతో ఆ కూటమిలో చేరేందుకు జగన్ కు చాన్స్ లేదు. అందుకే ఆయనకు ఏకైక ఆప్షన్ ఇండియా కూటమి. కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి ఎన్నికలకు సిద్ధం కావడమే ఆయన ముందున్న కర్తవ్యం. కెసిఆర్ ది మరీ విచిత్ర పరిస్థితి. తెలంగాణలో ఆ పార్టీ ఏ కూటమిలో చేరాలనుకున్నా అధికారం ఆశించే పరిస్థితిలో లేదు. కేవలం సర్దుబాటు వరకు మాత్రమే చేయగలదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కెసిఆర్ తో పాటు జగన్ రాజకీయ కార్నర్ లో ఉన్నట్టే

ఆస్పత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటం : మంత్రి సురేఖ

డాక్టర్లు సమయపాలన పాటించడం లేదని ఫైర్ అయ్యారు మంత్రి కొండా సురేఖ. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గరం అయ్యారు. వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని అదేశించామని తెలిపారు. వరంగల్ లోని ప్రాంతీయ కంటి ఆస్పత్రిని పరిశీలించారు మంత్రి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐ బ్యాంక్ వృధగా ఉంటుందని ప్రొఫెసర్ కొరత ఉందని చెప్పారు. వైద్య పరికరాల కొరత ఉందని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు మంత్రి. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది షోకాజ్ నోటీసులు అందించాలని మంత్రి కొండా సురేఖ సూచించారు.

ఆల్ ది బెస్ట్ బసవయ్య..

పెన్ పవర్ డెస్క్:ఆర్థిక ఇబ్బందులతో లక్నో ఐఐటీలో చేరలేకపోతున్నానంటూ అత్తిలికి చెందిన బసవయ్య అనే విద్యార్థి ఆవేదన వ్యక్తం చేయగా, నేనున్నా తమ్ముడూ... ఫీజు విషయం నేను చూసుకుంటా అంటూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆ విద్యార్థికి భరోసా ఇవ్వడం తెలిసిందే. దీనిపై ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించారు. మంత్రి నారా లోకేశ్ ను ప్రశంసించారు. నారా లోకేశ్ స్పందించి విద్యార్థికి చేసిన సాయం స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. తన కల సాకారం అవుతుందని ఆ విద్యార్థి ఊహించి ఉండడని అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆల్ ది బెస్ట్ బసవయ్య అంటూ తాను కూడా ఆ విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు.

కాగా, లక్నో ఐఐటీలో ఫీజు రూ.4 లక్షలు ఉందని, అంత ఖర్చు తన కుటుంబం భరించలేని స్థితిలో ఉందని బసవయ్య మంత్రి నారా లోకేశ్ ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశాడు. తన తల్లిదండ్రులు కూలి పనులు చేసుకునే పేదవాళ్లని బసవయ్య పేర్కొన్నాడు.

ఈ ట్వీట్ పై స్పందించిన నారా లోకేశ్... బసవయ్యా, నీ కల నెరవేర్చే బాధ్యత నాది అంటూ పూర్తి భరోసా అందించారు. దాంతో, నారా లోకేశ్ పై ప్రశంసల వర్షం కురుస్తోంది.

హీరా గోల్డ్ కుంభకోణం కేసు.. ముగిసిన ఈడీ దర్యాప్తు

- మొదటి పేజి తరువాయి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమ వారం సోదాలు నిర్వహించింది. ఇవాళ తెల్లవారుజాము నుంచే హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌తో పాటు, తిరుపతి, విశాఖపట్నంలో ఒకేసారి ఐదు చోట్ల సోదాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. హీరో గోల్డ్ అధిపతి, నౌహీరా షేక్ రూ. 400 కోట్ల వరకు అక్రమంగా సంపాదించారని సోదాలో గుర్తించామనిఈడీ అధికారులు తెలిపారు. నౌహీరా షేక్, వివిధ స్కీమ్‌ల పేరుతో వేల కోట్ల రూపాయల డిపాజిట్లు సేకరించి ఎంతో మందిని మోసగించారన్న ఆరోపణలతో దాడులు నిర్వహించామని అధికారులు తెలిపారు. ఈ సోదాల్లో భారీగా ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోదాల్లో 90 లక్షల నగదు, 12 కొత్త లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 25 కోట్ల విలువ చేసే బినామీ ఆస్తుల పేపర్లను, నౌహీరా షేక్ పేరు మీదున్న 13 ఆస్తుల పత్రాలను స్వాధీనం చేసుకొని ఆమెని అరెస్ట్ చేశామన్నారు. కాగా నౌహీరా షేక్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా 60కిపైగా కేసులు నమోదయ్యాయి.

వరద బీభత్సం.. నాగార్జున సాగర్ 16 గేట్లు ఎత్తివేత

- మొదటి పేజి తరువాయి

నిర్వహించిన అనంతరం 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తినారు. ఎగువ నుండి వస్తున్న వరద పట్టి దశల వారీగా మొత్తం 16 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నామని సీఈ నాగేశ్వరరావు తెలియజేశారు. భారీ వర్షాలకు తోడు ఎగువన కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాజెక్టులు పొంగి పారుతుండడంతో నాగార్జునసాగర్ డ్యామ్ కు భారీ వరద పోటెత్తడం జరుగుతుంది.

గత సంవత్సరంలో ఆగస్టులో ఈసారి కూడా ఆగస్టులోనే నాగార్జున సాగర్ డ్యామ్ గరిష్ట నీటి మట్టానికి చేరుకోవడంతో గేట్లు తెరచుకున్నాయి. ఎగువన శ్రీశైలం డ్యామ్ వద్ద అన్ని గేట్లు ఎత్తేసి నాలుగు లక్షలకు పైగా వరద దిగువనకు వదులుతున్నారు.దీంతో ఈ వరద వేగంగా సాగర్‌కు చేరుకుంటోంది. శ్రీశైలానికి ఎగువ నుంచి 4,00,491 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో 590 అడుగులకు గాను 583 అడుగుల నీరు ప్రస్తుతం చేరింది. సాగర్ యొక్క మొత్తం టిఎంసిలో 312 గాను 290 టీఎంసీలు నీళ్లు ఉన్నాయి గేట్ల ద్వారా43 వేల 986 క్యూసెక్కుల నీరు దిగువనకు విడుదల చేశారు.మొత్తానికి ఇన్ ఫ్లో 3 లక్షల 23 వేల 331 క్యూసెక్కుల వరద కొనసాగుతుంది. ఔట్ ఫ్లో లక్షా 63 వలే 220 క్యూసెక్కులు. కుడి ఎడమ కాలువల ద్వారా మొత్తానికి ఔట్ ఫ్లో 83 వేల 549 క్యూసెక్కుల వరద వచ్చే చేరుతుంది. ప్రవాహానికి అనుగుణంగా దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. వరద పెరిగే కొద్దీ మరికొన్ని గేట్లు కూడా ఎత్తి విడుదల చేస్తామని అధికారులు చెబుతున్నారు..

ఖాకీ పౌరుషం తెలుసు అని మాట్లాడిన పవన్ కల్యాణ్ ఇప్పుడెందుకు మాట్లాడడంలేదు

పెన్ పవర్ డెస్క్:ఏపీలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. ఏపీలో ప్రభుత్వ ప్రేరేపిత హింస జరుగుతోందని, కళ్ల ముందే ఘోరాలు జరుగుతుంటే పోలీసులు చేతులు కట్టుకుని చూస్తున్నారని విమర్శించారు. నంద్యాలలో టీడీపీ నేతలు మారణాయుధాలతో బహిరంగంగా తిరుగుతున్నారని ఆరోపించారు. వైసీపీ కార్యకర్తల ప్రాణాలు పోతున్నా, కనీసం ఎఫ్ఐఆర్ లు కూడా నమోదు చేయడంలేదని అన్నారు. నడిరోడ్డుపై చంపేస్తుంటే పోలీసులు గాల్లోకి కూడా కాల్పులు జరపలేదని పేర్ని నాని తెలిపారు. అరాచకాలకు మారుపేరుగా ఉండే బీహార్ లో ప్రస్తుతం శాంతిభద్రతలు నెలకొంటే, ఏపీలో మాత్రం శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని విమర్శించారు. ఆఖరికి పోలీసులు కూడా కూటమి నేతల చేతిలో అవమానాలకు గురవుతున్నారని, భట్టిప్రోలులో తెలుగుదేశం నేతలు ఎస్ఐ చొక్కా పట్టుకున్నారని, ఖాకీ పౌరుషం తెలుసంటూ మాట్లాడిన పవన్ కల్యాణ్ దీనిపై ఎందుకు మాట్లాడడం లేదని పేర్ని నాని నిలదీశారు. ఇంత దిక్కుమాలిన ప్రభుత్వాన్ని, ఇంత దిగజారిన ప్రభుత్వాన్ని మన రాష్ట్రంలోనే చూస్తున్నామని పేర్కొన్నారు.

చంద్రబాబు అనుభవజ్ఞుడు.. ఆయన నుంచి

నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది

- మొదటి పేజి తరువాయి

అభిప్రాయపడ్డారు. నేర్చుకోవాలనుకునే తపన ఉన్న తనలాంటి వారందం కలిసి వ్యవస్థలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. చంద్రబాబు విజన్‌ను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. విభజన వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామని, అవమానాలు ఎదుర్కొన్నామని పేర్కొన్నారు. సీఎం చెబుతున్న స్కిల్ సెన్సెస్‌కు సలహాలు, సూచనలు అవసరమని వివరించారు.

రాష్ట్రం వికసిస్తేనే భారత్ సూపర్ పవర్

97 శాతం స్ట్రైక్ రేట్‌తో ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్న జనసేనాని.. ఒకవేళ ఈసారి అధికారంలోకి రాకపోయినా కూడా ప్రజాస్వామ్యంలో నిలబడి వ్యవస్థను బలోపేతం చేయాలని అనుకున్నట్టు చెప్పారు. తమది బాధ్యతాయుత ప్రభుత్వమని పేర్కొన్నారు. ఒక రాష్ట్రం ఎలా ఉండకూడదో చెప్పేందుకు గత ఐదేళ్లలో రాష్ట్రం ఉదాహరణగా నిలిచిందన్నారు.

రాష్ట్రంలో ఒకే రోజు 13,326 గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేశామని, గ్రామాల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. పిఠాపురంలో లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పైలట్ జెక్టుగా చేపడుతున్నట్టు పవన్ తెలిపారు. 2047 నాటికి భారత్ సూపర్ పవర్ కావాలంటే రాష్ట్రం వికసిత ఆంధ్రప్రదేశ్ కావాల్సిన అవసరం ఉందని పవన్ నొక్కి చెప్పారు.

నాకు సెక్యూరిటి తగ్గించారు..

- మొదటి పేజి తరువాయి

ఆదేశాలు ఇవ్వాలంటూ జగన్ పిటిషన్ దాఖలు చేశారు.

కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా తన భద్రతను తొలగించిందని, తనను అంతమొందించే లక్ష్యంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని జగన్ తన పిటిషన్ లో ఆరోపించారు. తనకు ప్రాణహాని ఉన్న విషయాన్ని పరిశీలించకుండానే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం తగదని పేర్కొన్నారు.

అయితే, జగన్ కు భద్రత తగ్గించారన్న వాదనలను పోలీసు శాఖ, రాష్ట్ర ప్రభుత్వం కొట్టిపారేశాయి. నిబంధన మేరకే జగన్ కు భద్రత కేటాయించామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. జగన్ కు జడ్ ప్లస్ సెక్యూరిటీ కొనసాగుతుందని తెలిపాయి. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పుడు అదనంగా కల్పించే భద్రతనే ఇప్పుడు

తగ్గించామని పోలీసు శాఖ వెల్లడించింది. జగన్ కు ఇప్పుడు సీఎం హోదా భద్రత ఇవ్వడం కుదరదని అధికారులు తేల్చిచెప్పారు. కాగా, జూన్ 3వ తేదీ నాటికి తనకు 900 మంది పోలీసులతో భద్రత ఉండేదని, ఇప్పుడు కూడా అదే భద్రత కావాలని జగన్ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. జగన్ కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం కూడా సరిగా లేదని తెలిపారు.

హైకోర్టులో అరవింద్ కేజ్రీవాల్‌కు చుక్కెదురు

- మొదటి పేజి తరువాయి

ఈ అరెస్టను హైకోర్టు సమర్థించింది. కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు కొట్టివేసింది. సరైన కారణాలు లేకుండా సీబీఐ అరెస్ట్ చేసిందని చెప్పడానికి ఆధారాలు లేవని పేర్కొంది. బెయిల్ కోసం చేసుకున్న దరఖాస్తును కూడా హైకోర్టు కొట్టివేసింది. అయితే బెయిల్ కోసం ట్రయల్ కోర్టులో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించింది.

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తొలుత ఈడీ కేజ్రీవాల్‌ను మార్చి 21న అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఆయనకు ఊరట లభించినప్పటికీ సీబీఐ అరెస్ట్ విషయంలో జైల్లోనే ఉండిపోయారు. ఈడీ కేసులో జులై 12న ఆయనకు మధ్యంతర బెయిల్ లభించింది.

అమరావతి ఆర్-5 జోన్ లబ్ధిదారులపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మొదటి పేజి తరువాయి

అధికారులను ఆదేశించా రు. ఆర్–5 జోన్ లబ్ధిదారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వారికోసం భూ సేకరణ చేపట్టాలని, అవసరమైతే టిడ్కో ఇళ్ల తరహాలో కట్టించి ఇవ్వాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పేదలను తీసుకువచ్చి అమరావతిలో ఆర్–5 జోన్ ఏర్పాటు చేసి వారికి ఇళ్ల స్థలాలు కేటాయించడం తెలిసిందే. ఆ విధంగా తీసుకువచ్చిన పేదలకు వారి సొంత ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామే తప్ప, వారికి అమరావతిలో స్థలాలు కేటాయించలేమని చంద్రబాబు నేడు స్పష్టం చేశారు.

దేశం నుంచి పారిపోయిన

షేక్ హసీనా...

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్ లో రిజర్వేషన్ల వ్యతిరేక నిరసనలు తీవ్ర హింసాత్మకంగా మారిన నేపథ్యంలో, ప్రధాని షేక్ హసీనా పదవికి రాజీనామా చేశారు. ఆమె ఇప్పటికే ఢాకా నుంచి బయల్దేరి భారత్ చేరుకున్నారని, త్రిపురలోని అగర్తల సిటీలో ఆమె హెలికాప్టర్ ల్యాండైందని వార్తలు వస్తున్నాయి. మరోవైపు, బంగ్లాదేశ్ లో పాలనను సైన్యం తన అధీనంలోకి తీసుకుంది. దీనిపై బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్ జమాన్ సందేశం వెలువరించారు. అన్ని రాజకీయ పార్టీలతో చర్చించిన తర్వాత బంగ్లాదేశ్ లో సైనిక పాలన విధించినట్టు ప్రకటించారు. త్వరలోనే తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బంగ్లాదేశ్ లో కర్ఫ్యూ, అత్యవసర పరిస్థితి విధించాల్సిన అవసరం లేదని, ఇవాళ రాత్రి లోగా పరిస్థితులను అదుపులోకి తెస్తామని ధీమా వ్యక్తం చేశారు. హింసను ఆపాలని ఆయన బంగ్లాదేశ్ పౌరులకు విజ్ఞప్తి చేశారు. దేశంలో త్వరలోనే శాంతిని నెలకొల్పుతామని పేర్కొన్నారు.

భారత్‌కు చేరుకున్న షేక్ హసీనా... ఆమె విమానాన్ని అనుసరించిన భారత వాయుసేన ఫైటర్ జెట్

సాయంత్రం 5.30 గంటలకు భారత్‌కు చేరుకున్న షేక్ హసీనా

షేక్ హసీనా విమానాన్ని అనుసరించిన వాయుసేన ఫైటర్ జెట్స్

భారత్ దౌత్య కార్యాలయం వద్ద భద్రత కట్టుదిట్టం

బంగ్లాదేశ్ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా సోమవారం సాయంత్రం 5.30 గంటలకు భారత్‌కు చేరుకున్నారు. ఆ దేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో పదవికి రాజీనామా చేసిన ఆమె సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలని భావించారు. ఈ క్రమంలో సాయంత్రం భారత్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి ఆమె నేరుగా లండన్ వెళ్లనున్నారు.

షేక్ హసీనా విమానాన్ని అనుసరించిన వాయుసేన ఫైటర్ జెట్స్

షేక్ హసీనా బంగ్లాదేశ్‌కు చెందిన సీ–130 విమానం భారత గగనతలంలోకి ప్రవేశించిన వెంటనే భారత వైమానిక దళం యుద్ధ విమానాలు గాల్లోకి ఎగిరాయి. కొద్దిసేపు సీ–130 విమానాన్ని భారత ఫైటర్స్ జెట్స్ అనుసరించాయి. ఈ సీ–130 విమానంలో షేక్ హసీనా భారత్ చేరుకున్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు భారత వాయుసేన, సైన్యం ముందే సిద్ధమైనట్లుగా విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

భారత్ దౌత్య కార్యాలయం వద్ద భద్రత కట్టుదిట్టం

బంగ్లాదేశ్‌లోని హింసాత్మక ఘటనల దృష్ట్యా ఆ దేశంలోని భారత దౌత్య కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అదే సమయంలో ఢిల్లీలోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయం వద్ద కూడా భద్రతను పెంచారు.

ఢాకాకు ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు

బంగ్లాదేశ్ తాజా పరిణామాల నేపథ్యంలో ఎయిరిండియా విమానాలను రద్దు చేసింది. ఇప్పటికే టిక్కెట్లను కొన్న ప్రయాణికులకు అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత అత్యంత కీలకమని వెల్లడించింది.

హిరోషిమా ఘోర కలికి 79 యేళ్లు

జపాన్ దేశానికి చెందిన చారిత్రక పట్టణాల్లో హిరోషిమా ఒకటి. జపాన్‌లోని అతిపెద్ద ద్వీపమైన హోంషులో ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం చివరిలో అనగా.. 1945 సంవత్సరం ఆగస్టు 6వ తేదీన అగ్రదేశం అమెరికా జపాన్‌పై ఈ అణుబాంబు దాడి జరిపింది. ఈ దాడి జరిగిన క్షణాల్లోనే హిరోషిమా నగరం భస్మీపటలమైంది. ప్రపంచంలో మొట్టమొదటిసారిగా అణుబాంబు దాడికి గురైన నగరం కూడా ఇదే. ఆ తర్వాత అదే ఏడాది, అదే నెల తొమ్మిదో తేదీన నాగసాకిపై అమెరికా రెండో అణు బాంబును ప్రయోగించి ఆ ప్రాంతాన్ని సర్వనాశనం చేసింది.

హిరోషిమా నగరాన్ని 1589లో మోరి టెరిమోటో స్థాపించాడు. ఆ తర్వాత జరిగిన యుద్ధాల్లో ఈ నగరం మరెందరో రాజుల వశమైంది. బలమైన ఆర్థిక వ్యవస్థ మరియు సైనిక వ్యవస్థను కలిగి ఉండటం దీని సొంతం. రెండో ప్రపంచ యుద్ధంలో చుగోకు ప్రాంత సైన్యపు ప్రధాన స్థావరం హిరోషిమా నగరం కావడం విశేషం. సైన్యానికి సరఫరా చేసే అనేక ఆయుధ డిపోలు ఈ నగరంలో ఉండేవి. అందుకే ఈ నగరంపై అమెరికా కన్నుపడింది.

ఫలితంగానే అమెరికా 1945, ఆగస్టు ఆరో తేదీన ఉదయం గం.8.15 నిమిషాలకు బి-29 అనే బాంబర్ విమానం ద్వారా అణుబాంబును హిరోషిమాపై జారవిడిచింది. ఇలా మొదటిసారిగా అణుబాంబు ద్వారా ధ్వంసం చేయబడ్డ తొలి నగరంగా హిరోషిమా ప్రపంచ చరిత్ర పుటలకెక్కింది. అణుబాంబు దాడి జరిగిన కొన్ని క్షణాల్లోనే 70 వేల మందికి పైగా మరణించగా, అణుధూళి వల్ల మరో 90 వేల నుంచి లక్షా 40 వేల మంది మరణించినట్లు గణాంకాలు చెపుతున్నాయి.

నాటి దాడికి హిరోషిమాలోని భవనాల్లో సుమారు 69 శాతం నేలమట్టమయ్యాయి. అంతేకాదు 1942లో 4,19,182గా ఉన్న నగర జనాభా అణు దాడితో 1,37,197కు చేరిందంటే దాడి ప్రభావం ఎంత తీవ్రమైనదో అర్థం చేసుకోవచ్చు. నేటికి ఈ సంఘటన జరిగి సరిగ్గా 79సంవత్సరాలు. 1955 నాటికి పూర్తిగా కోలుకున్న ఈ నగరం.. అంచెలంచెలుగా అభివృద్ధి చెందింది.

పుట్టుక నీది.... చావు నీది.... బ్రతుకంత తెలంగాణది

నేడు తెలంగాణా జాతి పిత ప్రోపెసర్ జయశంకర్ సార్ జయంతి

తెలంగాణ సిద్ధాంతకర్త, తెలంగాణ జాతిపిత మన ప్రొఫెసర్ స్వర్గీయ కొత్తపల్లి జయశంకర్ 1934, ఆగస్టు 6 న వరంగల్ జిల్లా, ఆత్మకూరు మండలం అక్కంపేటలో జయశంకర్ విశ్వబ్రాహ్మణ కులం లో జన్మించారు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత్‌రావు. ఆయనకు ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు.. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమ్జన్సీ కాలంలో ఆయన సీకేఎం కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సీకేఎం కళాశాల అంటేనే జిల్లాలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా అప్పట్లో పేరుండేంది. విప్లవకవి వరవరరావు లాంటి వాళ్లు ఆ కాలేజీలో అధ్యాపకులుగా వ్యవహరించారు. ఎమ్జన్సీ గడ్డురోజుల్లో ఆయన కళాశాలను నడిపి ఎంతో మంది విద్యార్థుల్ని, అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవడం సర్వసాధారణమే కానీ ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని పేరుపెట్టి పిలవడం ఒక్క జయశంకర్ కే సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ప్రముఖ సాహితివేత్త రామశాస్త్రి కన్నీళ్లపర్యంతమయ్యారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశవిదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎస్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కే. సీతారామావు తదితరులు అనేక మందికి ఆదర్శ గురువు జయశంకర్.తెలంగాణా ఉద్యమంలో 1969 తెలంగాణా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1952 లో జయశంకర్ నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన 1954 లో ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చాడు. కె.సి.ఆర్‌కు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించాడు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశాడు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానా' (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి, తర్వాత మరణించాలి) అని అనేవాడు.విదేశాల్లో తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా వ్యాప్తిచేయడంలో ఆయన పాత్ర మరవలేనిది. విద్యార్థి దశ నుంచే తెలం'గానం'ఆచార్య జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ ఉద్యమంలోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించారు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించే మహనీయుడు. తెలంగాణ డిమాండ్‌ను 1969 నుంచి సునిశితంగా అధ్యయనం చేస్తూ, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసాడు.తెలంగాణలోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట గుత్ప అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికలమీద, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణన్నినాదాన్ని వినింపించిన పోరాట శీలి.ఉస్మానియాను తలుచుకుంటే తెలంగాణ వాడినైనందుకు గర్వంతో ఛాతి ఉబ్బుతుంది. ఎన్నెన్ని పోరాటాలకు, ఆరాటాలకు అది వేదికైంది చెప్పు.. అందరికీ ఉస్మానియా యూనివర్శిటీ అంటే చెట్లు కనిపిస్తయి.. కానీ మొన్నటికి మొన్న తెలంగాణ కోసం అమరులైన అనేక మంది విద్యార్థులు ఆ చెట్ల సాక్షిగా నాకు కళ్లముందే కదులుతు కనిపిస్తరు. దు:ఖమొస్తది.. అయితే నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచే అదృష్టం ఎంతమందికి దక్కుతుంది. వాళ్లకు మరణం లేదు? అదే ఉస్మానియాలో డిసెంబర్ 9 ప్రకటన తర్వాత పిల్లలు జరుపుకున్న సంబరం నా జీవితంలో మర్చిపోలేని గొప్ప జ్ఞాపకం. కానీ వారి భవిష్యత్ కలలతో ఆడుకున్నది ఎవరు? వారి ఆశలతో ఆడుకుని? వారి శవాలపై ప్రమాణం చేసిన రాజకీయనాయకులకు వాళ్ల ఉసురు తగలకుండా పోతుందా'తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కాంక్ష గురించిమా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశ నుంచి శాసక దశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి..!!తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011 జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు.

పాఠశాలల పరిశుభ్రత కోసం తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం!

స్కూళ్లలో పరిశుభ్రత కోసం నిధులు కేటాయిస్తూ నిర్ణయం

'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'కి స్కూళ్ల పరిశుభ్రత బాధ్యతలు అప్పగింత

విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు గ్రాంట్

పాఠశాలల పరిశుభ్రత కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'కి స్కూళ్ల పరిశుభ్రత బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం గ్రాంట్స్ మంజూరు చేసింది. పాఠశాలల నిధులకు అదనంగా ఈ గ్రాంట్‌ను కేటాయించినట్లు తెలిపింది.

30 లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.3 వేలు, 31 నుంచి 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు రూ.6 వేలు, 101 నుంచి 200 మంది ఉంటే రూ.8 వేలు, 251 నుంచి 500 లోపు విద్యార్థులు ఉంటే రూ.12 వేలు, 501 నుంచి 750 మంది వరకు విద్యార్థులు ఉంటే రూ.15 వేలు, 750 కంటే ఎక్కువ మంది ఉంటే రూ.20 వేల చొప్పున గ్రాంట్ ఇవ్వనుంది. మొత్తం 10 నెలల కాలానికి ఒకేసారి నిధులు విడుదల చేస్తారు. తెలంగాణలోని పాఠశాలల్లో పరిశుభ్రత కొరవడిన నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది.

బంగ్లాదేశ్‌లో భయంకర పరిస్థితులు... జాతిపిత విగ్రహాన్ని కూడా వదలని నిరసనకారులు!

బంగ్లా రాజధాని ఢాకాలో ఆందోళనకారుల విధ్వంసం

ఢాకాలోని ప్రధాని ప్యాలెస్ ముట్టడి

జాతిపిత షేక్ ముజిబుర్ రెహమాన్ విగ్రహం ధ్వంసం

సుమారు 4 లక్షల మంది నిరసనకారులు వీధుల్లో ఉన్నట్లు స్థానిక మీడియా అంచనా

బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అంతకంతకు దిగజారుతున్నాయి. బంగ్లా రాజధాని ఢాకాలో ఆందోళనకారులు విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం విడిచివెళ్లినట్లు వార్తలు రావడంతో వేలాది మంది బంగ్లాదేశ్ నిరసనకారులు కర్ఫ్యూను ధిక్కరించి రాజధాని ఢాకాలోని ప్రధాని ప్యాలెస్‌ను ముట్టడించారు. అంతటితో ఆగకుండా ఆ దేశ జాతిపిత, హసీనా తండ్రి, బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ విగ్రహాన్ని కూడా వారు ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఢాకాలో ఎక్కడిక్కడ సైనికులు, పోలీసులు సాయుధ వాహనాలు, ముళ్ల కంచెలు, బారికేడ్లు ఉన్నప్పటికీ... ఆందోళనకారులు అన్నింటినీ దాటుకుని వచ్చి హసీనా కార్యాలయాన్ని ముట్టడించినట్లు అక్కడి మీడియా పేర్కొంది.సుమారు 4 లక్షల మంది నిరసనకారులు వీధుల్లో ఉన్నారని స్థానిక మీడియా అంచనా. సివిల్ సర్వీస్ ఉద్యోగాల కోటాలకు వ్యతిరేకంగా గత నెలలో ప్రారంభమైన నిరసన ర్యాలీలు ప్రధాని హసీనా 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికే వరకు వెళ్లింది. అంతేగాక దేశంలో తీవ్ర అశాంతికి దారితీశాయి.నిరసనకారుల ఆందోళన నేపథ్యంలో నిన్న జరిగిన హింసలో 14 మంది పోలీసు అధికారులతో సహా 98 మంది మృతిచెందారు. జులైలో నిరసనలు ప్రారంభమైనప్పటి నుండి హింసాకాండలో ఇప్పటివరకూ మరణించిన వారి సంఖ్య 300కి చేరింది.

కేటీపీఎస్‌లోని 8 కూలింగ్ టవర్లు కూల్చివేత...

- నాలుగేళ్ల క్రితం మూతబడిన కర్మాగారం
- కూలింగ్ టవర్లు కూల్చివేయాలని కేటీపీఎస్ నిర్ణయం
- కూల్చివేత ప్రక్రియ చేపట్టిన జైపూర్ సంస్థ
- మూడు దశల్లో ఎనిమిది టవర్లు కూల్చివేత

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారిగా విద్యుత్‌ను అందించిన కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్) ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ప్లాంట్‌ను కూల్చివేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కేటీపీఎస్ కు చెందిన 8 కూలింగ్ టవర్లను అధికారులు కూల్చివేశారు. కాలం చెల్లడంతో 2020 ఏప్రిల్ 11న మెయింటెనెన్స్ ప్లాంట్ మూతబడింది. కూలింగ్ టవర్లు ఉన్న ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో వాటిని కూల్చివేయాలని కేటీపీఎస్ నిర్ణయించింది. ఈ క్రమంలో 2023 జనవరి 18 నుంచి పాత కర్మాగారానికి సంబంధించిన టవర్ల కూల్చివేత ప్రక్రియ పనులు జరుగుతున్నాయి.ఈ టవర్ల కూల్చివేతకు జెన్‌కో ద్వారా టెండర్లను ఆహ్వానించారు. హెచ్‌ఆర్ కమర్షియల్‌కు కొన్ని నెలల క్రితం రూ.485 కోట్లకు కాంట్రాక్ట్ ఇచ్చారు. పాత కేటీపీఎస్ ప్లాంట్‌లో 100, 120 మీటర్ల ఎత్తులో ఉన్న పలు కూలింగ్ టవర్లను గత ఫిబ్రవరిలో నేలమట్టం చేశారు. 1965-67 నుంచి 1978 వరకు దశలవారీగా నిర్మించిన ఏ, బీ, సీ పవర్ స్టేషన్లలో 720 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ఎనిమిది కూలింగ్ టవర్లను నిర్మించారు.ఈ టవర్ల కూల్చివేత ప్రక్రియను జైపూర్‌కు చెందిన ప్రైవేటు సంస్థ చేపట్టింది. ట్రాన్స్‌కోతో పాటు జిల్లా కలెక్టర్ అనుమతులు పొందిన తర్వాత కూల్చివేత చేపట్టారు. 30 మంది సిబ్బంది దాదాపు నెల రోజుల పాటు సన్నాహాలు చేశారు. మూడు దశల్లో కూల్చివేత కొనసాగింది. మొదట 'ఏ' స్టేషన్‌లోని 102 మీటర్ల ఎత్తుగల నాలుగు కూలింగ్ టవర్లను, ఆ తర్వాత 115 మీటర్ల ఎత్తుగల నాలుగు టవర్లను రెండు దశల్లో నేలమట్టం చేశారు. వీటిని కూల్చేందుకు ఇంప్లోషన్ టెక్నిక్ ను ఉపయోగించారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్ర విభజన డిమాండ్లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం

రూల్ 185 కింద అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన ప్రభుత్వం

తీర్మానానికి మద్దతు పలికిన ప్రతిపక్ష బీజేపీ

ఉత్తర ప్రాంతాల అభివృద్ధిని కోరుకుంటున్నామన్న బీజేపీ

పశ్చిమ బెంగాల్ విభజన డిమాండ్లను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. రాష్ట్రాన్ని విభజించాలంటూ... ముఖ్యంగా ఉత్తర బెంగాల్‌తో కూడిన ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతం ఏర్పాటు చేయాలని వివిధ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో అధికార టీఎంసీ సోమవారం రూల్ 185 కింద అసెంబ్లీలో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ... కోఆపరేటివ్ ఫెడరలిజాన్ని తాము నమ్ముతామని, అయితే రాష్ట్రాన్ని విభజించే ప్రయత్నాలను మాత్రం ఖండిస్తున్నామన్నారు.ఈ తీర్మానానికి ప్రతిపక్ష బీజేపీ కూడా మద్దతు పలికింది. అయితే ఉత్తర ప్రాంతాల అభివృద్ధిని కోరుకుంటున్నట్లు పేర్కొంది. తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారి మాట్లాడుతూ... ఐక్య పశ్చిమ బెంగాల్ సమగ్ర అభివృద్ధిని తాము కోరుకుంటున్నామని, రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నానికైనా తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ సమగ్ర అభివృద్ధి గురించి తీర్మానంలో ప్రస్తావించాలని కోరారు.ప్రతిపక్ష పార్టీ ప్రతిపాదనను తీర్మానంలో చేర్చేందుకు మమతా బెనర్జీ అంగీకరించారు. చర్చల అనంతరం ఎలాంటి విభజన డిమాండ్ చేయకుండా బెంగాల్‌ను ఆదుకుంటామని, బెంగాల్ అభివృద్ధికి కృషి చేస్తామనే ప్రత్యామ్నాయ తీర్మానాలను సభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు.

సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ ప్రభుత్వానికి చుక్కెదురు

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) సభ్యులను నామినేటెడ్ చేసే అధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉందని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. ఎంసీడీలో 10 మంది సభ్యులను మంత్రి మండలి సలహా మేరకు నామినేట్ చేయాలంటూ ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం... ఈ నామినేషన్ అంశంలో స్థానిక ప్రభుత్వం సలహా అవసరం లేదని, ఎల్జీకి చట్టం ప్రకారం అధికారాలు ఉన్నాయని తెలిపింది.ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ నుంచి ఈ అధికారం ఎల్జీకి వచ్చిందని, కాబట్టి ఎల్జీ స్థానిక ప్రభుత్వ సలహాను పాటించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఆయనకు చట్టం ప్రకారం అధికారం ఉన్నట్లు తెలిపింది.

2022 డిసెంబర్‌లో జరిగిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. మొత్తం 250 వార్డులకు గాను ఆ పార్టీ 134 స్థానాలను దక్కించుకుంది. అయితే లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నియమించిన 10 మంది కౌన్సిలర్ల చేత ప్రిసైడింగ్ అధికారి ప్రమాణం చేయించడం వివాదానికి కారణమైంది. ఈ వ్యవహారంపై ఆమ్ ఆద్మీ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విచారణ అనంతరం నేడు తీర్పును వెలువరించింది.

ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ గ్రాహం థోర్ప్ కన్నుమూత

ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ప్రకటన

ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్న ఈసీబీ

ఇంగ్లండ్ అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరంటూ కితాబు

1993-2005 మధ్య ఇంగ్లండ్ తరపున 100 టెస్టులు, 82 వన్డేలు ఆడిన థోర్ప్

ఇంగ్లండ్ దిగ్గజ క్రికెటర్ గ్రాహం థోర్ప్ (55) కన్నుమూశాడు. ఈ విషయాన్ని ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తెలిపింది. ఈ సందర్భంగా ఈసీబీ ఓ ప్రత్యేక ప్రకటనను విడుదల చేసింది. "గ్రాహం థోర్ప్ ఇకలేరనే వార్త చాలా బాధ కలిగించింది. ఇంగ్లండ్ అత్యుత్తమ బ్యాటర్లలో ఆయన ఒకరు. ఆయన క్రికెట్ కుటుంబానికి ప్రియమైన సభ్యుడు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులతో గౌరవించబడ్డాడు. ఆయన మృతితో క్రికెట్ ప్రపంచం నేడు శోక సంద్రంలో మునిగిపోయింది. ఆయన భార్య అమండా, పిల్లలు, తండ్రి జియోఫ్, కుటుంబ సభ్యులు, స్నేహితులందరికీ ప్రగాఢసానుభూతి" అని ఈసీబీ తన ప్రకటనలో పేర్కొంది.

గ్రాహం థోర్ప్ క్రికెట్ కెరీర్ ఇలా..

1993-2005 మధ్య ఇంగ్లండ్ తరపున 100 టెస్టులు, 82 వన్డేలు ఆడాడు. టెస్టుల్లో 44.66 సగటుతో 16 సెంచరీల సాయంతో 6,744 పరుగులు చేశాడు. ఈ స్టైలిష్ ఎడమచేతి వాటం బ్యాటర్ వన్డేల్లో 37.18 సగటుతో 21 అర్ధసెంచరీలతో 2380 రన్స్ చేశాడు.

థోర్ప్ సర్రే తరపున 17 సంవత్సరాలు ఆడాడు. అక్కడ అతను ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో 241 మ్యాచ్‌లు, 271 లిస్ట్ -ఏ గేమ్‌లు ఆడాడు. కౌంటీ తరపున 20,000 కంటే ఎక్కువ పరుగులు చేశాడు.

సర్రే సీఈఓ స్టీవ్ ఎల్వర్తీ మాట్లాడుతూ... "క్లబ్‌తో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ గ్రాహం మరణించిన విషాద వార్తతో కృంగిపోయారు. అతను క్లబ్, దేశం కోసం గొప్ప విజయాలు అందించాడు. చాలా మంది క్రికెట్ అభిమానులకు హీరో" అని చెప్పుకొచ్చారు.

కాగా, గత రెండేళ్లుగా గ్రాహం అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. ఆయన 2022 మార్చిలో ఆఫ్ఘనిస్థాన్ ప్రధాన కోచ్‌గా సెలక్ట్ అయ్యాడు. అయితే అతను జట్టులో చేరడానికి ముందే తీవ్రమైన అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. గ్రాహం థోర్ప్ ఇంగ్లండ్ బ్యాటింగ్ కోచ్, అసిస్టెంట్ కోచ్‌గా కూడా పనిచేశాడు. అయితే, 2022 ఫిబ్రవరిలో ఇంగ్లండ్ జట్టు యాషెస్‌లో 4-0తో ఓడిపోయిన తర్వాత పదవీవిరమణ చేశాడు.

శ్రీలంకతో మ్యాచ్: ఇంతకీ ఆ బంతికి కోహ్లీ అవుటా? కాదా?..

ధనంజయ బౌలింగ్‌లో కోహ్లీ ఎల్బీడబ్ల్యూ

అవుటిచ్చిన ఫీల్డ్ అంపైర్

థర్డ్ అంపైర్ మాత్రం కోహ్లీకి అనుకూలంగా నిర్ణయం

హెల్మెట్ విసిరికొట్టిన శ్రీలంక వికెట్ కీపర్

ఆటగాళ్ల తీవ్ర అసంతృప్తి



శ్రీలంక జట్టుతో కొలంబో లోని ప్రేమదాస స్టేడియంలో నిన్న జరిగిన రెండో వన్డేలో భారత జట్టు ఓటమి పాలైంది. శ్రీలంక బౌలర్ అకిల ధనంజయ 15వ ఓవర్ చివరి బంతికి కోహ్లీ వికెట్ల ముందు దొరికిపోయాడు. అంపైర్ కూడా వేలెత్తాడు. నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న శుభమన్ గిల్‌తో మాట్లాడిన కోహ్లీ మైదానం వీడాడు. అయితే, థర్డ్ అంపైర్ రివ్యూ అందరినీ డైలమాలో పడేసింది. బంతి కోహ్లీ బ్యాట్‌ను దాటి ప్యాడ్‌ను తాకడానికి ముందు అల్ట్రాఎడ్జ్ కనిపించింది. బ్యాట్‌కు, బంతికి మధ్య చాలానే గ్యాప్ ఉన్నట్టు చూపించింది. దీంతో థర్డ్ అంపైర్ కోహ్లీకి అనుకూలంగా నిర్ణయం ప్రకటించాడు. ఈ నిర్ణయం శ్రీలంక ఫీల్డర్లతోపాటు జట్టు హెడ్‌కోచ్ సనత్ జయసూర్యను అసహనానికి గురిచేసింది. వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ అయితే తన హెల్మెట్‌ను తీసి నేలకేసి కొట్టాడు. ఆ తర్వాత మళ్లీ బ్యాటింగ్ చేసిన కోహ్లీ వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేకపోయాడు. మరో నాలుగు ఓవర్లు మాత్రమే ఆడి వాండెర్సే బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. 19 బంతులు ఎదుర్కొన్న కోహ్లీ రెండు ఫోర్లతో 14 పరుగులు మాత్రమే చేశాడు. కాగా, ఈ మ్యాచ్‌లో శ్రీలంక లెగ్ స్పిన్నర్ జెఫ్రీ వాండెర్సే 33 పరుగులిచ్చి 6 వికెట్లు తీసుకుని జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

పారిస్ ఒలింపిక్స్: సెమీస్‌కు దూసుకెళ్లిన భారత హాకీ జట్టుకు భారీ షాక్

- జర్మనీతో సెమీస్‌లో తలపడనున్న భారత జట్టు
- భారత డిఫెండర్ అమిత్ రోహిత్‌దాస్‌పై ఒలింపిక్ కమిటీ ఒక మ్యాచ్ నిషేధం
- అసంతృప్తి వ్యక్తం చేసిన భారత హాకీ సంఘం

పారిస్ ఒలింపిక్స్‌లో సెమీస్ చేసిన భారత హాకీ జట్టుకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. జర్మనీతో మంగళవారం జరగనున్న సెమీస్‌కు కీలక ఆటగాడు, డిఫెండర్ అమిత్ రోహిదాస్ అందుబాటులో ఉండడం లేదు. బ్రిటన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో ప్రత్యర్థి ఆటగాడికి స్టిక్ తగిలించాడన్న కారణంతో ఒలింపిక్ కమిటీ అమిత్‌పై వేటు వేసింది. ఒక మ్యాచ్ నిషేధం విధించింది. బ్రిటన్‌తో జరిగిన మ్యాచ్‌లో అమిత్ రెడ్‌కార్డ్ అందుకుని బయటకు వెళ్లాడు. అయినప్పటికీ భారత జట్టు 10 మందితోనే ప్రత్యర్థిని ఎదుర్కొని విజయం సాధించింది. అమిత్‌పై ఒలింపిక్ కమిటీ వేటు వేయడాన్ని భారత హాకీ సంఘం తీవ్రంగా స్పందించింది.

ఇలాంటి ఘటనల వల్ల ఆటగాళ్లకు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసింది. క్రీడా సమగ్రతను కాపాడేందుకు భవిష్యత్తులో జరగబోయే మ్యాచ్‌లనైనా సరిగ్గా జరిగేలా ముున్ముందు సమీక్షించాలని హాకీ ఇండియా కోరింది.

నికితా శర్మ మీ కోరికను లేవనెత్తుతు ంది

జగతి మేడం స్టన్నింగ్.. పవన్ సాంగ్ కు అలా చేస్తూ!



జ్యోతి రాయ్.. గుప్పెడంత మనసు సీరియల్ తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమే. ఆ సీరియల్ లో జగతిగా తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. చీరకట్టుతో అమ్మ పాత్రలో, టీచర్ పాత్రలో ఒదిగి పోయింది. ప్రస్తుతం సీరియల్ లో ఆమె పాత్ర చనిపోయింది. దీంతో ఈ అమ్మడు.. సినిమాలు, వెబ్ సిరీస్ లతో బిజీబిజీగా గడుపుతోంది. సీరియల్ లో ఎంతో పద్ధతిగా కనిపించే జ్యోతి రాయ్.. సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తుంటోంది. స్కిన్ షోతో విపరీతంగా ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. ట్రెండీ ఔట్ ఫిట్స్ లో దిగిన ఫొటోలను షేర్ చేస్తూ సందడి చేస్తుంటోంది. కుర్రకారు మతులు పోగొడుతుంటోంది. డైలీ తన సోషల్ మీడియా వాల్ చెక్ చేయాలనేంతలా పోజులిస్తుంటోంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన వీడియో నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. సింగిల్ పీస్ వైట్ కలర్ డ్రెస్ వేసిన ఈ అమ్మడు.. సోఫాలో కూర్చుని కొంటె చూపులతో సోషల్ మీడియాను అల్లాడిస్తోంది. చేతిలో వైన్ గ్లాస్ తో చిల్ అవుతోంది. బ్యాక్ గ్రౌండ్ లో పవన్ కల్యాణ్ సినిమాలోని ఇట్స్ టైమ్ టూ పార్టీ నౌ సాంగ్ ను యాడ్ చేసింది. నాన్ ఆల్కహాలిక్ డ్రింక్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. బాగా పార్టీ చేసుకోండి మేడం అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.ఇప్పటికే తన మొదటి భర్తతో విడాకులు తీసుకున్న జ్యోతి రాయ్.. ఇటీవల తన రెండో మ్యారేజ్ పై క్లారిటీ ఇచ్చింది. యంగ్ డైరెక్టర్ పూర్వాజ్ ను రెండో పెళ్లి చేసుకున్నట్లు పరోక్షంగా తెలిపింది. పూర్వాజ్ బర్త్ డే సందర్భంగా పెట్టిన పోస్ట్ తో పెళ్లి విషయాన్ని పంచుకుంది. ఆ సమయంలో నెటిజన్లు వారికి కంగ్రాట్స్ తెలిపారు. ఏ మాస్టర్ పీస్ సినిమాను పూర్వాజ్ తెరకెక్కిస్తుండగా.. జ్యోతి రాయ్ నటిస్తోంది. ఆ సినిమా సమయంలో వీరిద్దరూ ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. 20 ఏళ్లపాటు సీరియళ్లు చేసిన జ్యోతి రాయ్.. ప్రస్తుతం ఏ మాస్టర్ పీస్ మూవీతో పాటు నో మోర్ సీక్రెట్స్ , ప్రెట్టీ గర్ల్ అనే వెబ్ సిరీస్ లలో యాక్ట్ చేస్తోంది. అయితే ప్రెట్టీ గర్ల్ వెబ్ సిరీస్ లోని జ్యోతి రాయ్ ఫస్ట్ లుక్ ఇటీవలే విడుదలై సంచలనం సృష్టించింది. మరి జ్యోతి రాయ్ కొత్త మూవీ, వెబ్ సిరీస్ లు ఎలా ఆకట్టుకుంటాయో చూడాలి.

అబ్బురపరిచే దుస్తుల్లో చిత్రాంగద సింగ్ స్టైలిష్ క్లిక్‌లు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com